క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న మాజీ సర్పంచ్ రవి

షాబాద్: నరెడ్లగూడ మాజీ సర్పంచ్ ముక్కు రవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. మంగళవారం రాత్రి చేవెళ్లలో జరిగిన కార్యక్రమంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి

మొయినాబాద్ రూరల్: ఉత్తేజపరిచే ఈవెంట్ టెక్నికల్ ఫెస్ట్‌లతో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి విద్యార్థులనుద్దేశించి పేర్కొన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం టెక్నికల్ ఈవెంట్ ఫెస్ట్‌ను క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్థసారథి ప్రారంభించి మాట్లాడారు. టెక్నో ఫెస్ట్ పోటీల వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని, విజ్ఞానంతో ఉల్లాసకరమైన ఆలోచనలు వస్తాయని తెలిపారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, రివార్డులు రూ.లక్ష వరకు వోచర్స్ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, క్యాంపస్ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్ రూ.10,116 లు విరాళం ప్రకటించారు.ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ, చరికొండ గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహావిష్కరణ చేపడుతున్నందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జంగయ్య, యాదయ్య, దర్గయ్య, శ్రీను, మహేందర్, శ్రీశైలం,వేణు, శివ తదితరులు పాల్గొన్నారు.

కేవీ రమేశ్‌రాజుకు కమిటెడ్ సెక్రెటరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీ రమేశ్‌రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: కేవీ రమేశ్‌రాజు చేసిన సేవలను గుర్తించిన లయన్స్‌క్లబ్ వారు ఆయనకు కమిటెడ్ సెక్రెటరీ అవార్డు అందజేశారు. మంగళవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సమావేశంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320సీ రీజియన్ చైర్‌పర్సన్ లయన్ సాధు శ్యామ్ ప్రసాద్ ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌రాజు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఇందూరి శ్రీనివాస్, ట్రెజరర్ లయన్ భీంరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఫరీద్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రేమకుమారి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద స్మార్ట్ ఈషా ఉమెన్, చిల్డ్రన్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు, పురపాలక సంఘం సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం

- వరండాలో తరగతులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఆగిన ఉర్దూమీడియం భవనం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో ఉర్దూ మీడియం పాఠశాలకు సొంత భవనం లేదు. తరగతులు మాత్రం అక్కడ, ఇక్కడ, చెట్లకింద, పక్కనే ఉన్న మరో పాఠశాల వరండాలో కొనసాగిస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల పక్కపక్కనే ఉన్నాయి. ఉర్దూమీడియం విద్యార్థులు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలోని వరండాలో చదువుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తరగతిగదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీనికి సంబంధించిన పాఠశాల భవనం మాత్రం అసంపూర్తిగా ఉండటంతో ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు అసౌకర్యానికి లోనవుతున్నారు.

ప్రారంభం ఇలా..

మండల కేంద్రమైన నందిగామలో 2010లో ఉర్దూ మీడియం పాఠశాల ప్రారంభమైంది. అప్పట్లో ఓ కమ్యూనిటీ హాల్లో విద్యా వాలంటరీలతో తరగతులను కొనసాగించారు. 2012లో అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షలతో పాఠశాల భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ప్రాథమిక పాఠశాల పక్కనే ఉర్దూమీడియం భవనాన్ని నిర్మించేందుకు పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

2015 నుంచి రెగ్యూలర్ టీచర్‌ను ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా క్రమేణా పెరిగింది. అయినప్పటికీ ఉర్దూమీడియానికి సొంత భవనం లేకపోవడంతో ఎండా, వాన, చలిగాలులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూన్ నుంచి ఈ పాఠశాల కేవలం వరండాలో కొనసాగుతోంది. ఈ పాఠశాలలో 1 నుంచి ఐదోతరగతి వరకు 44 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద రూ.29లక్షలు మంజూరు చేసింది. ఈ పథకంతో రెండంతస్తులో భవనం నిర్మించడంతో పాటు కావాల్సిన ఫర్నీచర్‌ను కూడా ఏర్పాటు చేయాలి. కానీ అప్పట్లో వేసిన పిల్లర్ల మీద స్లాబ్ వేసిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. భవననిర్మాణానికి కావాల్సిన నిధులు రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేశాడు.



వరండాలో కొనసాగుతున్న తరగతులు

త్వరగా పూర్తి చేయించాలి

వరండాల్లో చదువులు కొనసాగించలేం. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆడుకుంటున్న సమయంలో మా తరగతులకు ఇబ్బందిగా మారుతుంది. దీంతో పాటు పాఠశాల సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమాల వల్ల కూడా అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని త్వరగా పూర్తి చేయించాలి.

– జాస్మిత, ఐదోతరగతి

వర్షం జల్లు పడుతుంది



సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులతో పాటు, తాము కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వర్షాకాలంలో వర్షం జల్లు పడడంతో ఇబ్బందిగా మారుతుంది. చదువులకు ఆటంకం ఏర్పడుతుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాన్ని వీలైనంత తొందర్లో పూర్తి చేయించాలి.

– ఎండి తాహీద్, హెచ్‌ఎం, ఉర్దూమీడియం

దైవచింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



కేశంపేట: జ్ఞాపిక అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: భక్తి భావంతో ముక్తి లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలో గంజ్ ఆవరణలోని వినాయక దేవాలయంలో బుధవారం బీఆర్‌ఎస్ నేత మలగారి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో కొందూటి నరేందర్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలన్నారు. భక్తి భావంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసాని శ్రీనివాస్, గోపాల్, వన్నాడ వెంకటేశ్, కోటిలింగం గౌడ్, శంకర్ లాల్‌లాహోటీ, భగవాన్ దాస్ మాలానీ, రాజన్ శాస్త్రీ, విష్ణు శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఎల్లగమోని అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బొధునంపల్లి గ్రామంలో బొడ్రాయి, పోచమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఐకమత్యంగా పండుగను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, నారాయణరెడ్డి, నవీన్‌కుమార్, శ్రీనివాసులు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దారెడ్డి కృష్ణారెడ్డి, వడ్ల వెంకటయ్య

మొయినాబాద్ రూరల్: ఆపద సమయంలో అంబులెన్స్ సేవలతో ప్రాణాలు కాపాడొచ్చని సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్యలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోడుగు కిష్టయ్య, గోడుగు కిష్టమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు గోడుగు యాదయ్య అంబులెన్స్ వాహనాన్ని కొనుగోలు చేసి బుధవారం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం అంబులెన్స్ దాత యాదయ్య మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే మంచినీటి ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి ఇంటింటికి నీటి సరఫరా చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోటికే ఆంజనేయులు, ప్రశాంత్‌రెడ్డి, పల్లె రాజు, శ్రీను, జహంగీర్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు అలవాటు చేయండి

జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి, వక్త భాస్కరయోగి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

చేవెళ్ల: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, క్రమశిక్షణ అలావాటు చేయాలని ప్రముఖ జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శి, వక్త భాస్కర యోగి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని సిల్వర్‌డేల్ హైస్కూల్ 'ఉత్‌క్రిష్ట్–2024' వార్షికోత్సవ వేడుకలను బుధవారం రాత్రి కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయోగి, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజ మాట్లాడారు. పాఠశాలలు చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యా నేర్పించే దేవాలయాలని చెప్పారు. కాని నేడు సమాజం ఎంతో మార్పు చెంది పుట్టిన పిల్లవాడి నుంచి పెద్దల వరకు అంతా సెల్‌ఫోన్‌లు, టీవీల మాయలో పడిపోయి పిల్లల చదువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవటం లేదన్నారు. కేవలం పాఠశాలలోనే చదువు నేర్చుకుంటే సరిపోదని మన ఇళ్లలో వాతావరణం కూడా పిల్లలపై ప్రభావం చూపిస్తోందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోనాచారి, ప్రిన్సిపాల్ సునితారెడ్డి, బోజిరెడ్డి, అంజయ్యగౌడ్, రమణారెడ్డి, ఉపాధ్యాయులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

షాద్‌నగర్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రతిభ, విశ్వభారతి, విజ్ఞాన్, విజేత కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 2,376 మందికి గాను 2,229 మంది విద్యార్థులు హాజరయ్యారు. 147 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి బందోబస్తు నిర్వహించారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాల, చాలెంజర్ ఇంటర్ కళాశాల, చిలుకూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పెద్దమంగళారంలోని మైనార్టీ గురుకుల కళాశాల, హిమాయత్‌నగర్‌లోని ఎన్టీఆర్ మోడల్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,583 మంది విద్యార్థులకు గాను 1,537 మంది హాజరయ్యారు. 46 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు.

శంకర్‌పల్లి: తెలంగాణ ఆదర్శ పాఠశాల, వివేకానంద జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల, వాసవి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,015మంది విద్యార్థులకు గాను 43మంది గైర్హాజరయ్యారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కడ్తాల్: పర్యావరణ రక్షణకు, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో తన జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి సింగిల్‌విండో కార్యాలయంతో పాటు, ప్రధాన కూడలిలో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, జీవీజీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు ఇర్షాద్, నాయకులు అంజి, జగదీశ్, ఉపేందర్, సంతోశ్, రాంచంద్రయ్య, కిరణ్, దేవేందర్, వీరేందర్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు కలుగుతుందని, ఈ శిబిరాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగించుకోవాలన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, వెల్‌స్పన్ మేనేజర్ భద్రయ్య వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి

యాచారం సీఐ శంకర్‌కుమార్

యాచారం: రోడ్లపై వాహనాలు జాగ్రత్తగా నడపాలని యాచారం సీఐ శంకర్‌కుమార్ సూచించారు. సాగర్‌రోడ్డుపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాదారులు జాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగవన్నారు. సాగర్‌రోడ్డుపై గునుగల్ గేట్ నుంచి మాల్ వరకు వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వైస్ ఎంపీపీగా బొల్లారం ప్రవళిక



బొల్లారం ప్రవళికను సన్మానిస్తున్న ఎంపీటీసీలు, అధికారులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా బొల్లారం ప్రవళిక వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేవెళ్ల డీఎల్‌పీఓ సతీశ్ అధ్యక్షతన శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యక్ష ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. 13మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 11మంది ఉన్నారు. వీరిలో 9మంది హాజరయ్యారు. ఉపాధ్యక్ష పదవి కోసం బొల్లారం ప్రవళికవెంకట్‌రెడ్డిని మహాలింగపురం ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి ప్రతిపాదించగా పర్వేద ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి బలపరిచాడు. ఒక్కరే నామినేషన్ వేయడంతో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా బొల్లారం ప్రవళికవెంకట్‌రెడ్డి ఎంపికైనట్లు ఎన్నిల అధికారి సతీశ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, జెడ్పీటీసీ గోవిందమ్మ, కోఆప్షన్ సభ్యుడు నయిం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన బొల్లారం ప్రవళికను పలువురు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చుక్కాపూర్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా పుష్ప, డీఈవోగా తరుణ్, కలెక్టర్‌గా రాంచరణ్, ముఖ్యమంత్రిగా విజేందర్‌లతో పాటు, 29 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామనాథం, పాపిరెడ్డి, మణిమాల, కృష్ణయ్య, రజిత, షహనాజ్, బాలకోటి, కవిత, యాదయ్య, శంకర్, మాధవి, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా దీక్షిత, జాయింట్ కలెక్టర్‌గా నిహారిక, అదనపు కలెక్టర్‌గా శ్వేత, డీఈఓగా శ్వేత, డిప్యూటీ డీఈఓగా ప్రసన్న, మంత్రులుగా శ్రీజ, హారిక, ప్రిన్సిపాల్‌గా ఆద్య వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనగట్టు శివాలయంలో బ్రహ్మోత్సవాలు



పూజలో ఆలయ ధర్మకర్తలు, పూజారులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయ, శ్రీ భ్రమరంభ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజతో ప్రారంభించి హోమం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి, అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మండలంలోని భక్తులు హాజరయ్యారు.

ఆలయ ధర్మకర్తలు, చైర్మన్ సున్నపు వసంత, సున్నపు మాణిక్యప్రభు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేశ్‌కుమార్ గురుస్వామి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వార్షికోత్సవ జెండా ఆవిష్కరిచారు.

'ప్రతిభను వెలికి తీసేవే సైన్స్ ఎగ్జిబిషన్లు'



చేవెళ్ల: నమూనాలను పరిశీలిస్తున్న పాఠశాల డైరెక్టర్లు నల్లనాయుడు, భారతి



షాద్‌నగర్: వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఉపయోగపడుతాయని చేవెళ్లలోని సత్యసాయి గ్రామర్ హైస్కూల్ డైరెక్టర్‌లు నల్ల నాయుడు, భారతిలు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ జ్ఞానాన్ని ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్: పట్టణంలోని కాకతీయ పాఠశాలలో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్యలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్చలం మురళీ, యుగేందర్, వంశీకృష్ణ, డైరెక్టర్ బాలత్రిపుర సుందరి, ప్రిన్సిపాల్ సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.